లక్ష్యం మేర మొక్కలు నాటాలి : కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): జిల్లాలో నిర్ధేశించిన మేర మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో వివిధ అధికారులతో వనమహోత్సంపై సమీక్ష నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో నిర్ధేశించిన లక్ష్యం మేరకు 15శాతం మొక్కలు మాత్రమే హోం ప్లాంటేషన్‌కు కేటాయించాలన్నారు. 85 శాతం ఇతర ప్లాంటేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జియో ట్యాగింగ్ కూడా పూర్తి చేయాలన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీఓలు కె మహేశ్వర్, రమేష్‌బాబు, డీఆర్‌డిఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుట్టుగా లింగనిర్ధారణ పరీక్షలు

- కాసుల కోసం ప్రైవేటు ఆసుపత్రుల దందా
- భ్రూణహత్యలకు కేరాఫ్‌గా హుజూరాబాద్, జమ్మికుంట
- హుస్నాబాద్‌లో నర్సింగ్ హోం నిర్వాహకుల అరెస్టు

హుజూరాబాద్, జూలై 11: హుజూరాబాద్, జమ్మికుంట ప్రాంతాల్లోని కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు భ్రూణహత్యలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు డబ్బులకు ఆశపడి లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. హుస్నాబాద్‌కు చెందిన ఓ వివాహితకు అబార్షన్ చేసిన ఘటనలో రెండు రోజుల క్రితం హుజూరాబాద్ పట్టణంలోని సూపర్‌బజార్‌లోని మాధవి నర్సింగ్ హోమ్ నిర్వాహకుడు కర్ర పాపిరెడ్డి, సిబ్బంది రావుల సత్యనారాయణ, లక్ష్మి (రజిత)లను హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన వెలుగులోకి రావడంతో లింగనిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు చర్చనీయాంశంగా మారాయి. హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లోని కొంత మంది ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు లింగ నిర్ధారణ పరీక్షలు గుట్టుచప్పుడు కాకుండా చేస్తున్నారు. ఏడాది క్రితం జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని తెలుసు కున్న అప్పటి డీఎంహెచ్‌వో నర్సింగ్ హోమ్‌ను తనిఖీ చేసి సీజ్ చేశారు.



ఇదిలా ఉండగానే నెల రోజుల క్రితం హుజూరాబాద్ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఆడ శిశువు మృతదేహం దొరికిన విషయం విధితమే. వాస్తవానికి వైద్యులు లింగనిర్ధారణ పరీక్షలు చేసినా బయటకు చెప్పవద్దని నిబంధనలు ఉన్నప్పటికీ డబ్బులకు ఆశపడి ఆడ, మగ బిడ్డ అని చెబుతున్నారు. లింగనిర్ధారణలో ఆడ శిశువు అని తెలియగానే కొంత మంది భ్రూణహత్యలకు పాల్పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్ఎంపీలను ఏజెంట్లుగా పెట్టుకొని ప్రైవేట్ నర్సింగ్ హోమ్ యజమానులు భ్రూణహత్యలకు పాల్పడుతున్నారు. ఇందులో ఆర్ఎంపీలకు కమీషన్లు అందజేస్తుంటారు.

ఇటీవల హుస్నాబాద్‌కు చెందిన ఓ మహిళ ఆర్ఎంపీల సహాయంతో అబార్షన్ చేయించుకోవడంతోనే ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన జిల్లా వైద్యాధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు ఇష్టారీతిగ వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరజిల్లుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మొహంతిలు స్పందించి ప్రైవేట్ ఆసుపత్రులపై నిఘా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

- **ప్రైవేట్ ఆసుపత్రుల్లో విచ్చలవిడిగా దోపిడీ:** హుజూరాబాద్, జమ్మికుంట ప్రాంతాల్లో ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు విచ్చలవిడిగా రోగుల నుంచి దోపిడీ చేస్తున్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగికి అవసరం లేని పరీక్షలు చేయిస్తూ నిలువునా దోపిడీ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా మెడికల్ షాపు నిర్వాహకులు కూడా అందినకాడికి మందుల పేరిట డబ్బులు లాగుతున్నారు. కొన్ని మెడికల్ దుకాణాల్లో మందులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.

హుజూరాబాద్, జమ్మికుంటలో అనుమతులు లేకుండా నర్సింగ్ హోమ్‌లు నిర్వహిస్తున్నా జిల్లా వైద్యాధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదనే చర్చ జరుగుతోంది. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు నర్సింగ్ హోమ్‌లు, మెడికల్ షాపులపై నిఘా ఏర్పాటు చేసి నిబంధనలు పాటించేలా తనిఖీలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పదవి పోయింది.. అప్పులే మిగిలాయి..!

- కోట్లలో బకాయిలు.. ● నాలుగేళ్లుగా ఎదురు చూపులు
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న మాజీ సర్పంచ్‌లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

'నాపై నమ్మకం ఉంచి సర్పంచ్‌గా గెలిపించారు.. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేద్దామని లక్ష్యంగా పెట్టుకున్నా.. లక్షల రూపాయలు అప్పుచేసి అభివృద్ధి పనులు పూర్తి చేశా.. ఇప్పుడు పదవీ కాలం ముగిసిపోయింది. అయినా చేసిన పనులకు సంబంధించిన బిల్లులు మాత్రం రాలేదు. అప్పులిచ్చిన వారు ప్రతిరోజు ఇంటికి వచ్చి డబ్బులడుగుతున్నారు. వారికి డబ్బు ఎప్పుడిస్తామో కూడా చెప్పలేని పరిస్థితి ఉన్నది'. ఇదీ తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ రావుల రమేశ్ ఆవేదన.. ఇది ఒక రావుల రమేశ్‌కు మాత్రమే పరిమితమైన ఆవేదన కాదు.. జిల్లాలోని 313 గ్రామపంచాయతీల సర్పంచ్‌ల అందరి ఆవేదన. ఏ సర్పంచ్‌ను ప్రశ్నించినా ఇదే గోడు వినిపిస్తున్నారు. ప్రభుత్వం ఎప్పుడు కరుణిస్తుందో, ఎప్పుడు బిల్లులు చేతికి వస్తాయో, ఎప్పుడు అప్పులు తీర్చుతామో అంటూ మాజీ సర్పంచ్‌లందరూ ఆశగా ఎదురుచూస్తున్నారు. సర్పంచ్‌లుగా ప్రజలు గెలిపించినందుకు తమ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి తమదైన ముద్ర వేసుకోవాలని అవకాశం లభిస్తే మళ్లీ పోటీచేసి గెలుపొందాలని ఆశించి సర్పంచ్‌లందరూ తమ వద్ద ఉన్న డబ్బే కాకుండా అప్పుచేసి మరీ వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ఇదిగో వస్తున్నాయ్... అదిగో వస్తున్నాయ్ అని అధికారులు అంటుంటే రాకుండా ఎక్కడ పోతాయిలే అనే ధీమాతో పనులు పూర్తి చేశారు. నిధులైతే విడుదల కాలేదు కానీ పదవీకాలం మాత్రం పూర్తయింది. చేసిన పనుల అప్పుల భారంతో సర్పంచ్‌లందరూ పదవీ విరమణ చేశారు.





న్యాయం చేయాలంటున్న మాజీ సర్పంచ్‌లు

బిల్లుల కోసం మండల, జిల్లా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి స్పందన లేదని, సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో గర్శకుర్తి మాజీ సర్పంచు భర్త అలువాల తిరుపతి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి తమకు న్యాయం చేయాలని కోరారు. వెంటనే ప్రభుత్వం స్పందించి బకాయి నిధులను మంజూరు చేయాలని మాజీ సర్పంచ్‌లు కోరుతున్నారు. మొదటి ఎనిమిది నెలలు చెక్‌పవర్ లేక, రెండేళ్లు కొవిడ్, చివరి ఏడాదిలో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు రాక అప్పుపాలయ్యామే తప్ప ఆశించిన అభివృద్ధి చేయలేక పోయామని మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆత్మహత్యే శరణ్యం

తిప్పరబోయిన మొగిలి, శ్రీరాములపల్లె మాజీ సర్పంచ్, ఇల్లందకుంట మండలం



రెండు సంవత్సరాల క్రితం డ్రైనేజీ నిర్మాణం, బోరుబావులు, ఇతర జీపీ పనులకు సంబంధిం చిన 15 లక్షల రూపాయల బిల్లుల ను ఎంబీ రికార్డు చేయించాం. గత ప్రభుత్వం బిల్లులు ఇవ్వలేదు. ప్రభుత్వం మారి ఏడు నెలలు దాటుతున్నా మా బిల్లులకు మాత్రం మోక్షం కలగడం లేదు. బిల్లులు చెల్లించకపోతే ఆత్మహత్యే శరణ్యం.

చివరికి అప్పే మిగిలింది...

అభిషేక్‌రెడ్డి, కొక్కరకుంట మాజీ సర్పంచ్, రామడుగు మండలం



ఇంజనీరింగ్ చదివిన నేను గ్రామానికి ఏమో చేస్తానని రాజకీయాల్లోకి చివరికి అప్పులే మిగిలాయి. 15 లక్షల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇలా మండలంలో అందరికి కలిపి రెండు కోట్లకు పైగా బిల్లులు రావలసి ఉంది.

రూ.2.5 కోట్ల బిల్లులు పెండింగ్

బండారి ముత్తయ్య, కిష్టంపేట మాజీ సర్పంచ్, వీణవంక మండలం



మండలంలోని కిష్టంపేట, బేతిగల్, కనపర్తి, నర్సింగాపూర్, బ్రాహ్మణపల్లి, ఎల్బాక గ్రామాల్లో మిషన్ భగీరథ, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి రెండున్నర కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందుకు సంబంధించిన పనులు పూర్తిచేసి ఎంబీ రికార్డు చేసినప్పటికీ బిల్లులు రావడం లేదు.

● బకాయిల వివరాలు

కరీంనగర్ రూరల్ మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి 1.18 కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ పనులు చేసిన మాజీ సర్పంచులు, కాంట్రాక్టర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. జనరల్ ఫండ్, ఈజీఎస్ నిధులు, ఇతర నిధులతో పనలు చేసి ఎంబీ రికార్డు అయి మూడు, నాలుగేళ్లు అవుతున్నా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయలేదు. చామనపల్లిలో లక్ష, చర్లభూత్కూర్‌లో 7,56,663, దుబ్బపల్లిలో 2,87,014, ఎలబోతారంలో 6,83,000, ఫకీర్‌పేటలో 92,000, గోపాల్‌పూర్‌లో 5,15,091, ఇరుకుల్లలో 5,77,153, జూబ్లీనగర్‌లో 4,15,000, మందుపల్లిలో 4,00,000, ముగ్దుంపూర్ లో 12,28,767, నగునూర్‌లో 55,91,12, నల్లగుంట పల్లిలో 1,95,880, తహెర్‌కొండాపూర్‌లో 1,20,450 రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులకు సం బంధించిన బిల్లులను ప్రభుత్వం మంజూరు చేయక పోవడంతో ఆయా గ్రామాల మాజీ సర్పంచులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు.

- గన్నేరువరం మండలంలోని 14 గ్రామాల మాజీ సర్పంచులకు 1.83 కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గన్నేరువరంలో మన ఊరు..మన బడికి సంబంధించిన 15 లక్షలు, ఇతర నిధులు 7 లక్షలు, పారువెల్లలో మన ఊరు..మన బడికి సబంధించిన 2 లక్ష లు, ఖైలారంలో 4 లక్షలు, సీసీ రోడ్లకు 20 లక్షలు, జీపీ ఫండ్స్‌కు 2.50 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

సాంబయ్యపల్లిలో ఎంపీటీసీ ఫండ్స్ మూడు లక్షలు, జీపీ ఫండ్ 3.5 లక్షలు, సీసీ రోడ్లు 10 లక్షలు, యాస్వాడలో క్రీడాప్రాంగణానికి సంబంధించిన లక్షా 70 వేలు బిల్లులు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. చొక్కారావుపల్లిలో జీపీ ఫండ్ లక్ష, ఈజీఎస్ ఫండ్ లక్ష, మాదాపూర్‌లో జీపీ ఫండ్స్ ఏడు లక్షలు, సీసీ రోడ్ లక్ష, జంగపల్లిలో మహిళా సంఘ భవనం మూడు లక్షలు, జీపీ ఫండ్స్ 3 లక్షల 50వేలు, మన ఊరు మన బడి 3 లక్షలు, ఎమ్మెల్యే స్పెషల్ ఫండ్స్ 6 లక్షలు, ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ 4 లక్షలు, పీచుపల్లిలో రెడ్డి కమ్యూనిటీహాల్, సీసీ రోడ్లు, జీపీ ఫండ్స్‌కు సంబంధించి 23.6 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

గునుకుల కొండాపూర్‌లో అభివృద్ధి పనులకు సం బంధించిన రెండు లక్షలు, చీమలకుంటపల్లిలో సీసీ రోడ్లు, ఇతర పనులకు సంబంధించిన 8.7 లక్షలు, గుండ్లపల్లిలో రైతు వేదికకు సంబంధించిన ఆరు లక్షలు,కాసీంపేటలో ఈజీఎస్ 10 లక్షలు, జీపీఫండ్ 15 లక్షలు, ఓపెన్‌జిమ్, వైకుంఠధామం 7 లక్షలు, చాకలివానిపల్లిలో సీసీ రోడ్లు, ఇతర పనులకు సంబంధించి లక్షా 70వేల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

- శంకరపట్నం మండలంలోని 24 గ్రామ పం చాయతీలకు సంబంధించిన రూ.1,34,82,484ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో కేశవ పట్నం గ్రామ పంచాయతీలోనే 23 లక్షల పను లు పూర్తిచేసి బిల్లులు చెల్లించాల్సి ఉంది. గద్ద పాకలో 12,09,571, రాజాపూర్‌లో 11,94,952 రూపాయల బిల్లుల బకాయిలున్నాయి. మిగిలిన అన్ని గ్రామ పంచాయతీలకు కూడా రెండు లక్షల నుంచి 10 లక్షలలోపు బిల్లులు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది.
- గంగాధర మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో మన ఊరు మన బడి బిల్లులు ఎక్కుగా రావలసి ఉండగా గర్శకుర్తిలో 17 లక్షలు, గట్టుబూత్కూర్‌లో 12.5 లక్షలు, కాసా రంలో 17 లక్షలు, కోట్ల నర్సింహుల పల్లిలో 12.5 లక్షల రూపాయల విలువ చేసే అభివృద్ధి పనులు ఎన్నికలకు ముందు పూర్తిచేసి ఎంబీ రికార్డు కూడా చేయించుకున్నారు.
- సైదాపూర్ మండలంలోని 26 గ్రామ పంచా యతీలకు సంబంధించి 58,69,421 రూ పాయ ల బకాయిలు తాజా మాజీ సర్పంచ్‌లు, కాం ట్రాక్టర్లకు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. వీటికోసం వారంతా ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందోనంటూ ఎదురు చూస్తున్నారు.
- చిగురుమామిడి మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో చేసిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించినవి 70 లక్షలకుపైగా పెండింగ్‌లో ఉన్నాయి.
- చొప్పదండి మండలంలోని ఆర్నకొండ, కొలిమి కుంట, చాకుంట, రెవెల్లి, భూపాలపట్నం, కొత్తపల్లి, దేశాయ్‌పేట గ్రామాల్లో చేసిన అభి వృద్ధి పనులకు సంబంధించి కోటి రూపాయల మేరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇతర గ్రామాల్లో కూడా లక్ష నుంచి రెండు లక్షల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది.



- తిమ్మాపూర్ మండలంలోని 23 గ్రామ పం చాయతీల్లో 1.2 కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలోని 15 మండలాల్లోని 313 గ్రామ పంచాయతీల్లో మండలానికి కోటి రూపాయల చొప్పున దాదాపు 15నుంచి 20 కోట్ల మేరకు అభివృద్ధి పనులకు సంబం ధించిన బిల్లులు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది.
- జమ్మికుంట మండలంలో వైకుంఠ ధామాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, ఎలక్ట్రిసిటీ, వాటర్ ట్యాంకుల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు కోటిగా పైగానే పెండింగ్‌లో ఉన్నాయి.
- మానకొండూర్ మండలంలోని 28 గ్రామ పంచాయతీలకు సంబంధించిన కోటి 20 లక్షల మేరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్తపల్లి మండలంలోని ఎనిమిది గ్రామ పంచాయితీల్లోనూ ఇదే పరిస్థితి.

గ్రామీణ మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

- సమష్టి సహకారంతో ముందుకు సాగాలి
- స్కూల్ యూనిఫాం కుట్టడంలో మహిళా సంఘాలు విజయవంతం ● కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగటానికి ఇందిరా మహిళా శక్తి ఉపయోగపడుతుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఇందిరా మహిళా శక్తిపై డీఆర్‌డీఏ, మెప్మా, వ్యవసాయశాఖ, పశుసంవర్ధకశాఖ, పరిశ్రమ లశాఖ అధికారులతో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిద్దాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమానికి రూపకల్పన చేసిందని అన్నారు. మహిళలు వ్యాపారం ప్రారంభించే ముందు మార్కెటింగ్, వ్యాపారం గురించిన సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. కరీంనగర్ జిల్లాలో మొట్ట మొదటగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెప్మా, డీఆర్డిఓ, మహిళా సంఘాలు యూనిఫామ్స్ కుట్టి అందించడంతో కార్యక్రమం విజయవంతం అయిందని పేర్కొన్నారు. అదే విధంగా అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం ద్వారా సివిల్ పనులను మహిళా సంఘాల ద్వారా చేపట్టగా 85శాతం పనులు పూర్తయ్యా యని తెలిపారు. మిగిలిన 15 శాతం పనులు త్వరగా పూర్తిచేసి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. వినియోగదారుల ప్రాధాన్యతను చూరగొని వ్యాపారాలను వృద్ధి చేసుకోవాలని అన్నారు. వ్యాపారం కొరకు తీసుకునే రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. ముందుగా వ్యాపారాన్ని ఎక్కడ ప్రారంభించాలనుకున్నా అన్ని విషయాలపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ శ్రీనివాస్, ఎల్‌డీఎం ఆంజనేయులు, ఇండస్ట్రీస్ జీఎం నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా సంఘాల సభ్యులతో కలెక్టర్, అదనపు కలెక్టర్

సీఎంను కలిసిన కోమటిరెడ్డి, వెలిచాల



కరీంనగర్ అర్బన్, జూలై 11: సుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఉప ముఖ్యమంత్రి బట్టివిక్రమార్క, ప్రభుత్వ రాజకీయ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్‌బాబులను కలిసినట్లు తెలిపారు.

- కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్న పలు అభివృద్ధి పనులపై చర్చించినట్లు రాజేందర్‌రావు తెలిపారు.



గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చర్యలు

- మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి

మెట్‌పల్లి రూరల్, జూలై 11: గ్రామాల్లో ఎవరైనా గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి, ఎక్సైజ్ సీఐ వినోద్‌రాథోడులు హెచ్చరించారు. గురువారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని అల్లూరిసీతారామాతండా, ఆత్మనగర్ తండాలో తయారు చేస్తున్న గుడుంబా స్థావరాలపై పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. గుడుంబా తయారు చేస్తున్న సంతోష్‌నాయక్, గంగాధర్‌నాయక్‌లను పట్టుకొని వారి నుంచి 10లీటర్ల గుడుంబా పారాబోశారు. 500 లీటర్ల పానకం, ముడి సరుకులను ధ్వంసం చేశారు. అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. ఇకపై గ్రామంలో ఎవరైనా నాటు సారా తయారీ చేసిన, తయారీకి ముడి సరకు పరఫరా చేసిన చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా నాటుసారా తయారీకి కావాల్సిన వస్తువులు కొనుగోళ్లపై దృష్టి సారిస్తామన్నారు. దాడుల్లో పోలీసు, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



ఏఎస్ఆర్‌తండాలో గుడుంబాను పట్టుకున్న పోలీసులు, ఎక్సైజ్ అధికారులు

కోరపల్లి రోడ్డులో తనిఖీలు

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కోరపల్లి రోడ్డులో గల పలు ఇళ్లలో అబ్కారీ ఎస్ఐ సౌమ్య ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు చేపట్టారు. గుడుంబా విక్రయాలు ఏమైనా జరుపుతున్నారా అనే కోణంలో కుండలు, బకెట్లు, పాత్రలు, డ్రమ్ములను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గుడుంబ విక్రయాలు జరుగడం లేదని, ముందస్తు జాగ్రత్తలో భాగంగా తనిఖీలు జరిపినట్లు తెలిపారు. బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట అబ్కారీ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వాచ్‌మన్ నుంచి లెక్చరర్ స్థాయికి...



విజయ సంకేతం చూపుతున్న రాజ్‌కుమార్

బెల్లంపల్లి, జూలై 11: వాచ్‌మన్‌గా పనిచేసి జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించాడు కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన కొమురయ్య-పుష్పలత దంపతుల కుమారుడు రాజ్‌కుమార్. రాజ్‌కుమార్ తండ్రి పంచాయతీరాజ్ శాఖలో అటెండర్‌గా విధులు నిర్వహించేవాడు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండేది. తండ్రి మరణం తర్వాత కుటుంబానికి ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. రాజ్‌కుమార్ డిప్లొమాతోనే చదువు మానేసి పది సంవత్సరాల పాటు కరీంనగర్ జిల్లా పరిషత్ కార్యాలయంలో నైట్ వాచ్‌మన్‌గా విధులు నిర్వహించాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు చదువుకోవాలని సూచించడంతో మళ్లీ చదువుబాట పట్టాడు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఓపెన్ డిగ్రీతోపాటు పీజీ పూర్తి చేశాడు. టెట్ రెండు సార్లు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించాడు. 2017లో నిర్వహిం చిన ప్రభుత్వ గురుకుల పరీక్షలో టీజీటీ, పీజీటీ ఉద్యోగాల్లో ర్యాంకు సాధించి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పీజీటీ తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో తెలుగు సబ్జెక్టులో రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు, మల్టీజోన్ 1లో మూడో ర్యాంకు సాధించాడు. దీంతో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. స్నేహితులు, కుటుంబీకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఆరుబయటే పాఠాలు

- సరిపడా తరగతి గదులు లేక విద్యార్థుల ఇక్కట్లు

- వానాకాలంలో మరింత ఇబ్బందులు

మెట్‌పల్లి రూరల్, జూలై 11: గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు మెరుగైన బోధన అందించి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. ఉపాధ్యాయులు, తరగతి గదులున్న చోట విద్యార్థులు లేకపోవడం, టీచర్లు ఉన్న పాఠశాలలకు పిల్లలు రాకపోవడంతో పాఠశాలల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో తరగతి గదుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. గదుల కొరతతో ఆరుబయట ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై గదుల కొరత ప్రభావం తీవ్రంగా పడుతోంది. నిబంధనల ప్రకారం తరగతికి ఒక గది ఉండాలి. చాలా చోట్ల తరగతులకు సరిపడా గదులు లేవు. ముఖ్యంగా వానాకాలం ఈ సమస్య మరింతగా వేధిస్తోంది. వర్షాలు కురిసిన సమయంలో ఒకే తరగతి గదుల్లో విద్యార్థులను ఇరుకుగా కూర్చోబెడుతున్నారు. భౌతిక దూరం పాటించాలనే నిబంధన అమలు కావడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో బడి బాట కార్యక్రమాన్ని చేపట్టి చిన్నారులు, యువతను ఉత్తమ విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్నామని చెపుతున్న ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పాఠశాలలోని సమస్యలు వెక్కిరిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలను మోడల్‌గా తయారు చేయాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలనలో మన ఊరు మన బడి కింద పాఠశాలల అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టి నిధులు మంజూరు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలలోని ఎంపిక చేసి విద్యుదీకరణ, తాగునీరు, మూత్రశాలల మరమ్మతులు పూర్తిస్థాయిలో చేపట్టలేదు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి ప్రహరీ, కిచెన్ షెడ్స్ నిర్మాణాలను చేపట్టారు. చేసిన పనులకు గత ప్రభుత్వం మొదట్లో నిధులు ఇచ్చింది. అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలలకు ముందు నుంచి తరగతి గదుల నిర్మాణాలకు నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.



రాజేశ్వర్‌రావుపేటలో ఆరుబయట పాఠాలు వింటున్న విద్యార్థులు

● విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు...

గ్రామాల్లో మన ఊరు మన బడి కార్యక్రమాన్ని చేపట్టి పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు చేర్చుకున్నారు. కానీ పాఠశాలలో తరగతి గదల కొరతతో విద్యా బోధన ఆరుబయట చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వానాకాలంలో విద్యాబోధన చేయడానికి ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని రాజేశ్వర్‌రావుపేట, బండలింగాపూర్, రామలచ్చక్కపేట, కోనరావుపేట, జగ్గసాగర్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదుల కొరత ఉండడం వలన విద్యార్థులకు ఆరుబయట ఉపాధ్యాయులు బోధన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పలు గ్రామాల్లోని పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. ప్రతీ సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా తగినంత గదులు లేకపోవడంతో బోధన ఇబ్బందిగా కొనసాగుతోంది. పేద విద్యార్థులకు మంచి విద్య అందుబాటులోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలో ఇంగ్లీషు మీడియంలో విద్యనందించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నది. ముఖ్యంగా పాఠశాలలో సరైన తరగతి గదులు, సరైన వసతులు అందుబాటులో లేక విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరగతి గదుల కొరత విషయాన్ని గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీ సుకెళ్లినట్లు గ్రామాల్లోని మాజీ ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని నాయకులు కోరుతున్నారు.

● ప్రభుత్వానికి నివేదిస్తున్నాం..

- భీమయ్య, ఇన్‌చార్జి ఎంఈవో, మెట్‌పల్లి

మండంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. కొన్ని గ్రామాల్లోని పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం చేశాము. మన ఊరు మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనులకు నిధులు నిలిచిపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. దీంతో గదుల కొరత, పలు సమస్యలు అలాగే ఉన్నాయి. అమ్మ ఆదర్శ పథకంలో భాగంగా పాఠశాలలోని సమస్యలను పరిష్కారం అవుతున్నాయి.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, జూలై 11: మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీలలో పట్టుబడిన ముగ్గురు వాహనదారులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ గురువారం తీర్పు వెలువరించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో 23 మంది వాహనదారులను కోర్టులో హాజరుపరచగా ఇందులో ముగ్గురు వ్యక్తులకు 3 రోజుల జైలుశిక్ష లేదా మొత్తం ఏడు వేల జరిమానా చెల్లించాలని తీర్పు ఇచ్చారని సీఐ తెలిపారు. మిగతా 20 మంది వాహనదారులకు 35,500 రూపాయల జరిమానా విధించారని తెలిపారు.

ఇద్దరు యువకుల అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జూలై 11 : సిరిసిల్ల పట్టణంలోని బైపాస్ రోడ్డు, జూనియర్ కళాశాల వద్ద ద్విచక్రవాహనాలపై ప్రమాదకర విన్యాసాలు చేస్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసినట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. గురువారం సాయంత్రం సిరిసిల్ల పట్టణంలో ద్విచక్రవాహనాలపై ప్రమాదకర విన్యాసాలు చేస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు చేసి సుందరయ్యనగర్‌కు చెందిన బూరాని గణేష్‌సింగ్, భోగ రాజు అనే ఇద్దరు యువకులను పట్టుకొని ద్విచక్రవాహనాలను సీజ్ చేశారని అన్నారు. యువకులపై నూతన చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి 'గృహజ్యోతి' ఎడిట్ ఆప్షన్

గణేశ్‌నగర్, జూలై 11: గృహజ్యోతి పథకానికి అర్హులై ఉండి వివరాల నమోదులో తప్పులు దొర్లిన వారికి శుక్రవారం నుంచి ప్రభుత్వం ఎడిట్ ఆప్షన్లను ఇచ్చింది. నెలకు 200 యూనిట్లు వాడుతూ తెల్లరేషన్ కార్డు గల వారికి ఉచిత విద్యుత్ ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గతంలో గృహజ్యోతికి దరఖాస్తు చేసుకుని విద్యుత్ యూఎస్‌సీ/ఎస్‌సి నంబర్ తప్పుగాపడి జీరోబిల్ రాని వారు ఎంపీడీవో, మున్సిపల్ ఆఫీసుల్లో సరిచేసుకోవచ్చు. వినియోగదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు తెలిపారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా పట్టివేత

- 6.03 కిలోల గంజాయితో పాటు మూడు సెల్ ఫోన్లు స్వాధీనం

- వివరాలు వెల్లడించిన జగిత్యాల ఎస్పీ

జగిత్యాల టౌన్, జూలై 11: జగిత్యాల జిల్లా ధర్మపురి పోలీసులు అంతర్ రాష్ట్ర గంజాయి రాకెట్ ముఠాను పట్టుకున్నారు. వీరి వద్ద 6.03 కిలోల గంజాయితో పాటు మూడు సెల్ ఫోన్లు, రూ. 3,500 నగదును సీజ్ చేశారు. గురువారం జగిత్యాల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో దొంగల ముఠాను అరెస్టు చూపించి విలేకరుల సమావేశంలో ఎస్పీ అశోక్ కుమార్ వివరాలు వెల్లడించారు. జిల్లాలోని ధర్మపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల గంజాయి విక్రయిస్తూ రాయపట్నం గ్రామానికి చెందిన బత్తిని చందు, గొల్ల వెంకటేష్ పట్టుపడగా దొంతాపూర్ గ్రామానికి చెందిన దుర్గం రాము తప్పించుకుని పారిపోయాడు. బుధవారం ధర్మపురి మండలం బుద్దేష్‌పల్లి గ్రామంలో పోలీసుల కళ్లుగప్పి తప్పించుక తిరుగుతున్న రాము ఉన్నాడనే సమాచారం అందింది. దీంతో ధర్మపురి ఎస్ఐ ఉదయ్ కుమార్ తన సిబ్బందితో బుద్దేష్‌పల్లికి వెళ్లి గాలించగా రాముతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. వీరి వద్ద 6.300 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో రాముతో పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు ఒడిషా రాష్ట్రంలోని రాయగడ ప్రాంతానికి చెందిన దినేష్ కుమార్ నాయక్, మరొకరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరానికి చెందిన గుజ్జల పురుషోత్తంగా గుర్తించారు. మరో ఇద్దరు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. ఒడిషాకు చెందిన దినేష్‌కుమార్ నాయక్ గంజాయిని పండిస్తూ విజయనగరానికి చెందిన పురుషోత్తంకు సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. అయితే ధర్మపురి మండలంలోని దొంతాపూర్‌కు చెందిన దుర్గం రాము ఇదే మండంలోని మగ్గిడి గ్రామానికి చెందిన అజయ్, సంజయ్‌కు ఒడిషాకు చెందిన దినేష్‌కుమార్ నాయక్, విజయనగరానికి చెందిన పురుషోత్తంతో రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వీరంతా ఒక ముఠాగా ఏర్పడ్డారు. చందు, వెంకటేష్, రాము, అజయ్, సంజయ్ కలిసి ఒడిషా వెళ్లి అక్కడ రాయగడ రైల్వేస్టేషన్‌లో దినేష్ కుమార్ నాయక్, పురుషోత్తంలను కలుసుకుని గంజాయిని కొనుగోలు చేస్తూ ధర్మపురి ప్రాంతంలో విక్రయిస్తూ వ్యాపారాన్ని అభివృద్ధి చేయాలనే ప్లాన్ చేశారు. ధర్మపురి పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ధర్మపురి ప్రాంతానికి చెందిన వ్యక్తులతో పాటు ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను పట్టుకుని వారి గుట్టురట్టు చేశారు. ఒడిషాకు చెందిన దినేష్ కుమార్ నాయక్‌కు గతంలో ఏపీ రాష్ట్రంలో జరిగిన ఎన్‌డీపీఎస్ చట్టంలో ప్రమేయం ఉండడంతో పాటు ఒడిషాలోని షేల్‌ఖాల్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదై రాయగడ జైలులో శిక్షను కూడా అనుభవించాడు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

ఏపీకి చెందిన పురుషోత్తం సైతం ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసులో రాయగడ జైలుకు వెళ్లగా వీరిద్దరికి అక్కడ పరిచయం ఏర్పడినట్లు ఎస్పీ వివరించారు. ఈ కేసులో గతంలో బత్తిని చందు, గొల్ల వెంకటేష్ పట్టుబడగా, తాజాగా రాము, దినేష్ కుమార్ నాయక్, పురుషోత్తం పట్టుబడగా అజయ్, సంజయ్ అనే ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిపారు. జిల్లాలో అక్రమ గంజాయి సరఫరాపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాను గంజాయిరహిత జిల్లాగా మార్చడానికి స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతున్నామన్నారు. అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను పట్టుకున్న డీఎస్పీ రఘుచందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ధర్మపురి, గొల్లపల్లి ఎస్ఐలు ఉదయ్‌కుమార్, సతీష్, పోలీస్ సిబ్బంది రమేష్ నాయక్, పూర్ణ సాయి, రమేష్, రామస్వామి, అశోక్, సలీమోద్దీన్, వెంకటయ్య, నవీన్‌ను ఎస్పీ అభినందించి రివార్డులను అందజేశారు.

స్త్రీనిధి సొమ్ము స్వాహాపై ఆందోళన

- చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల డిమాండ్

కరీంనగర్ రూరల్, జూలై 11: స్త్రీనిధి సొమ్ము స్వాహాపై చర్యలు తీసుకోవాలని గురువారం చామనపల్లి గ్రామైక్య సంఘాల మహిళలు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. లక్షలు గోల్‌మాల్ జరుగుతుండగా, క్షేత్రస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తి గ్రామంలో 10కి పైగా మహిళా సంఘాలున్నాయని తెలిపారు. కరోనాకాలంలో సదరు సంఘాలకు స్త్రీ నిధి రుణాలు 35లక్షల రూపాయలు మంజూరయ్యాయి. వాటిని మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా ఓ కోఆర్డినేటర్ కరోనా సమయంలో రుణం సమాచారం తెలుపకుండా మహిళల ఐడి కార్డులు, బ్యాంకు ఖాతాలను సేకరించి, గుట్టుగా సొమ్ము స్వాహా చేశారని తెలిపారు. రెండేళ్ల క్రితం అక్రమ బాగోతం వెలుగు చూడగా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆ డబ్బు వడ్డీతో కలిపి మొత్తం 40లక్షలకు చేరింది. మహిళలకు రుణాలు ఇవ్వకపోగా రేపు మాపంటూ తిప్పుకున్నారని అన్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని మహిళలు ఆరోపించారు. గతంలో కరీంనగర్ రూరల్ పోలీసులకు డీఆర్‌డీఏ అధికారులకు, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. న్యాయం కోసం ప్రతి రోజు పోలీస్‌స్టేషన్లు, అధికారుల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నామని మహిళలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని శ్రీనిధి డబ్బులు, పొదుపు సంఘాల డబ్బులు ఇప్పించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో వీవో అధ్యక్షులు, గ్రామైక్య సంఘం మహిళలు గాలిపెల్లి కనుకలక్ష్మీ, నర్సమ్మ, రాజమ్మ, సరోజన, కనుకలక్ష్మి, సరోజన, ఈశ్వరమ్మ, అయిలమ్మ, విజయ, రమ, శారద, అరుణ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న చేగుర్తి మహిళ సంఘాల సభ్యులు

ఎస్సారెస్పీలోకి 1,794 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గురువారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 1,794 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది.

ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 12.44 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 17.243 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 6.573 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూలై 11: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,550 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు ఎనిమిది మంది రైతులు 124 క్వింటాళ్లు విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,550 రూపాయలు, కనిష్ఠ ధర 7300 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

కుక్కల దాడిలో గొర్రెల మృతి

సిరిసిల్ల రూరల్, జూలై 11: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు గ్రామంలోని గొర్రెల మందపై గురువారం తెల్లవారుజామున కుక్కలు దాడి చేయడంతో దాదాపు 20 గొర్రెలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన సిద్ధి కనకయ్య యాదవ్ అనే గొర్రెల కాపరి తనకు ఉన్న 40 గొర్రెలను గ్రామ శివారులోని తన ఇంటి వద్దనే ఏర్పాటు చేసిన షెడ్డులో ఉంచాడు. గురువారం తెల్లవారుజామున కుక్కలు గొర్రెల మందపై దాడి చేసి 20 గొర్రెలను చంపి వేయగా మరో 20 గొర్రెలను గాయపర్చాయి. గురువారం ఉదయం మంద వద్దకు వెళ్లిన కనకయ్య చనిపోయిన గొర్రెలను చూసి దు:ఖ సాగరంలో మునిగిపోయాడు. కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెలతో రెండు లక్షల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు గ్రామంలోని కుక్కలను తరలించాలని గ్రామస్థులు కోరారు.

దొంగ సొత్తు కొంటే కఠిన చర్యలు

- 160మంది స్క్రాప్ వర్తకులకు కౌన్సెలింగ్

- 27మంది బైండోవర్

సిరిసిల్ల క్రైం, జూలై 11: దొంగ సొత్తుకొంటే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహజన్ అన్నారు. రెండు రోజులుగా జిల్లావ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని స్క్రాప్ దుకాణాలపై పోలీసులు దాడులు నిర్వహించిన సందర్భంగా గురువారం ఎస్పీ వివరాలు వెల్లడించారు. స్క్రాప్ వ్యాపారం మాటున అక్రమ దందా కొనసాగించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా 160మంది స్క్రాప్ వర్తకులకు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. దీంతో 27మంది వర్తకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. షాపులో కొనుగోలు, అమ్మకాల్లో ప్రతి వస్తువుకు రిజిస్టర్‌లో నమోదుచేయాలన్నారు. తుక్కు, స్క్రాప్‌నకు తప్పకుండా రసీదులు ఇవ్వాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేయకూడదని ఎస్పీ తెలిపారు.

ముంబాయి పోలీసుల అదుపులో ఇద్దరు కరీంనగర్ వాసులు

-సైబర్‌క్రైం కేసులో అదుపులోకి

కరీంనగర్ క్రైం, జూలై 11: సైబర్ క్రైం కేసులో ప్రమేయం ఉందన్న కారణంగా ముంబాయి ఈస్ట్ రీజియన్ సైబర్ పోలీసులు గురువారం కరీంనగర్‌లో పలు చోట్ల సోదాలు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ముంబాయి ఈస్ట్ రీజియన్ సైబర్ వింగ్‌కు చెందిన ఓ ఇన్‌స్పెక్టర్ మరో నలుగురు పోలీసు సిబ్బందితో కూడిన బృందం గురువారం మధ్యాహ్నం కరీంనగర్‌కు చేరుకుని సుభాష్‌నగర్‌కు చెందిన ఫరూక్ అహ్మద్, ఆదర్శనగర్‌కు చెందిన వీరనాథ్‌ను అదుపులోకి కరీంనగర్ మూడో ఠాణాకు తరలించి విచారిస్తున్నట్లు తెలిసింది. మరో నిందితుడు అసీముద్దీన్‌తోపాటు మరో మహిళ పరారీలో ఉన్నట్లు సమాచారం. అతని కోసం ముంబాయి, స్థానిక పోలీసు టీం గాలిస్తున్నది. మార్చి నెలలో ముంబాయిలో బాధితుడి ఫిర్యాదుతో నమోదైన సైబర్ క్రైం కేసులో కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ బ్యాంక్‌లో మందాని ఇంపాడ్ పూర్ వెల్ఫేర్ ట్రస్ట్ సంస్థ పేరిట సెక్రెటరీ, ట్రెజరర్, సభ్యులు మొత్తం ఏడుగురి పేరిట జాయింట్ బ్యాంక్ ఖాతా తెరిచారు. ఈ ఖాతాలోకి సైబర్ క్రైంకు సంబంధించిన డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ముంబాయి సైబర్ పోలీసులు గుర్తించి, నిందితులను విచారించేందుకు ఇక్కడికి వచ్చినట్లు సమాచారం. అంతర్జాతీ సైబర్ నేరగాళ్లతో కరీంనగర్‌వాసులకు ఉన్న సంబంధం, బ్యాంక్ లావాదేవీలపై విచారణ జరుపుతున్నారు.

తల్లిదండ్రులను నిర్లక్ష్యానికి గురిచేస్తే చర్యలు

వేములవాడ కల్చరల్, జూలై 11 : వృద్ధాప్యంలో భరోసాగా ఉండాల్సిన సంతానం తల్లిదండ్రులను నిర్లక్ష్యానికి గురి చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కమిషనర్ డిజెబుల్ వెల్ఫేర్, వెల్ఫేర్ ఆఫ్ సీనియర్ సిటిజన్ అండ్ ట్రాన్స్‌జండర్ పర్సన్స్ శైలజ అన్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, పీఆర్వో సిరిగిరి శ్రీరాములు పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి వారి ప్రత్యేకపూజలో పాల్గొనగా ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం అందించి ఆలయాధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఆలయ గెస్ట్‌హౌస్‌లో శైలజ మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు. వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే టోల్ ఫ్రీ నంబర్ 14567 కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సంబంధిత అధికారులను నేరుగా ఇంటికి పంపించి క్షేత్రస్థాయిలో పరిశీలించి కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. అన్యాయం వయో వృద్ధుల ఆస్తిని వారసులు అనుభవిస్తూ వారిని నిర్లక్ష్యం చేసినట్లయితే అట్టి ఆస్తిని తిరిగి స్వాధీనం పరుచుకుని తిరిగి వయోవృద్ధులకు అందిస్తామని వివరించారు. జిల్లాలో వయోవృద్ధులు టోల్ ఫ్రీ నంబర్‌ను వినియెగించుకోవాలని 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి పీ లక్ష్మీరాజం, ఫీల్డ్ రెస్పెన్స్, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారులు ఉన్నారు.



స్వామి వారి శేషవస్త్రాలను అందజేస్తున్న ఆలయాధికారులు

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి



తిరుమల శ్రీవారి ఆలయంలో బండి సంజయ్‌కుమార్, కుటుంబసభ్యులు

భగత్‌నగర్, జూలై 11: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ గురువారం తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం, తన పుట్టినరోజును పురస్కరించుకుని గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనం చేసుకున్నారు.

తిరుపతిలో టీటీడీ అధికారులు ఆలయ మర్యాదలతో బండి సంజయ్‌కు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేదపండితులు బండి సంజయ్ కుటుంబసభ్యులకు ఆశీర్వచనం అందజేశారు.

వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్న నెమళ్లు

- ఇళ్ల మధ్య నెమలి మృతదేహం లభ్యం

గన్నేరువరం, జులై 11: మండలంలోని మైలారం గ్రామంలో జాతీయ పక్షులైన నెమల్లకు రక్షణ కరువైంది. మానేరు డ్యాం శివారులో ఉన్న మైలారం గ్రామం గుట్టల ప్రాంతం కావడంతో అక్కడ నెమల్లు, అడవిపందులు, కుందేళ్ళు, ఎలుగుబంట్లు ఉండడంతో వాటిని వేటగాళ్ళు వేటాడి చంపి వాటి మాంసాన్ని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు గ్రామంలో వెల్లువెత్తున్నాయి. గురువారం గ్రామంలోని జనావాసాల సమీపంలో నెమలి మృతదేహం, ఈకలు కనిపించాయి. వేటగాళ్ళు నెమలిని వేటాడి చంపి మాంసంగా మార్చే ప్రయత్నంలో ఏమరపాటు మూలంగా వీధి కుక్కలు నెమలి మృతదేహాన్ని లాక్కెళ్ళి తిన్నదని విశ్వసనీయ సమాచారం. గత కొంతకాలంగా ఈ నెమల్ల వేట యథేచ్ఛగా కొనసాగుతుందని, వన్యప్రాణుల మాంసాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వన్యప్రాణుల వేటపై దృష్టి సారించక పోవడం మూలంగా ఏకంగా జాతీయ పక్షి నెమల్లను సైతం వేటగాళ్ళు వదలటం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి నెమలుల వేటపై విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

● ఫారెస్ట్ అధికారుల పరిశీలన..

మైలారంలో నెమళ్ల వేట విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు డిప్యూటి రేంజ్ ఆఫీసర్ నర్సింగరావు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శేఖర్ సాయంత్రం మైలారం గ్రామానికి చేరుకొని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నెమలి మృతదేహం వద్ద పరిశీలించగా వారికి నెమలి ఈకలు లభించగా నెమలి కళేబరం కనబడలేదు. రాత్రి కావడంతో నెమలి మృతదేహాన్ని వెతకడం సాధ్యం కాలేదని తెలిపారు. శుక్రవారం తిరిగి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని కనుగొని పంచనామా నిర్వహించి, గ్రామంలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

చెరువు తూములు తెరిపించాలని ఆందోళన

మల్యాల, జూలై 11: మల్యాలలోని సూరప్ప చెరువు తూములను మూసివేయడంతో పంటలు సాగు చేయలేని పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి తూములు తెరిపించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సూరప్ప చెరువులో తమకు పట్టా భూములు ఉన్నాయని వానాకాలంలో ఆ భూములు నీటిలో మునిగిపోతుండగా కొన్నేళ్లుగా యాసంగి పంట మాత్రమే చేసుకుంటున్నామని అయితే మూడేళ్లుగా చెరువు తూములు తెరవకపోవడంతో నీరు అందులోనే ఉండి పంటలు చేసుకోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తూములు మూసి ఉండడంతో చెరువులో గల భూములు సాగు కాకపోగ, తూములు తెరువక నీళ్లు రాక చెరువు కింది భూములలో పంటలు సాగు చేయక నష్టపోవాల్సి వస్తుందని తహసీల్దార్‌తో పేర్కొన్నారు. తూములు తెరిపించి తమను ఆదుకోవాలని కోరారు. అనంతరం ఇరిగేషన్ అధికారులకు కూడా కలిసి తమ ఆవేదన తెలిపారు. కార్యక్రమంలో రైతులు బావు శంకర్, తాటిపాముల జగదీశ్వర్, జక్కుల రాయమల్లు, సంగ సత్యనారాయణ, బావు నాగభూషనం, గడ్డి లచ్చన్న, సంతోష్ తదితరులు అధికారులను కలిసిన వారిలో ఉన్నారు.

సాంకేతికలోపంతో నిలిచిన రిజిస్ట్రేషన్లు

కరీంనగర్ క్రైం, జూలై 11: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ సర్వర్‌డౌన్‌తో కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా గురువారం ఆస్తుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. క్రయవిక్రయదారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు వేచి చూసి విసిగిపోయి వెళ్లిపోయారు. గురువారం రోజు వివిధ రకాల రిజిస్ట్రేషన్ల కోసం దాదాపు 50 వరకు డాక్యుమెంట్లు సిద్ధం చేసుకుని కార్యాలయానికి వచ్చిన విక్రయదారులు కార్యాలయంలో సాంకేతికలోపం తలెత్తిందని అధికారులు చెప్పటంతో రోజంతా కార్యాలయం లోపల, బయట వేచి ఉన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్‌లింకప్ కాకుండా మొరాయించటంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయయని అధికారులు తెలిపారు. ఈకేవైసీ పూర్తి చేస్తేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతుంది. దీంతో సబ్‌రిజిస్ట్రార్‌లు కూడా కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూశారు. సాంకేతిక సమస్య పరిష్కారం అయితే ఏ సమయంలో అయినా రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. గురువారం రోజు స్లాట్‌ను శుక్రవారానికి అనుమతి ఇస్తామని తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని 14 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇదే సమస్యతో రిజిస్ట్రేషన్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

తెలంగాణ సంప్రదాయాలు దేశానికే ఆదర్శం

- గవర్నర్ సీపీ రాధాకృష్ణన్



గవర్నర్‌తో తాడిజెర్రి ఒగ్గుకళాకారుల బృందం

గంగాధర. జూలై 11: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు దేశానికే ఆదర్శమని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. డిల్లీలో ఈనెల 9,10 తేదీల్లో లాల్ దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి దేవస్థానం, తెలంగాణ భాష సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో బోనాల జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా గంగాధర మండలం తాడిజెర్రికి చెందిన ఈర్ల మహిపాల్ ఒగ్గు కళాకారుల బృందం గేట్‌వే ఆఫ్ ఇండియా నుంచి తెలంగాణ భవన్ వరకు జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఒగ్గుడోలు బృందాన్ని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడినట్లు ఈర్ల మహిపాల్ 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు. తెలంగాణ కవులు, కళాకారుల ఆటపాటలు ప్రజలను ఉత్తేజాన్ని కలిగిస్తాయన్నారు. కళాకారులు, కవులు, సాహితీవేత్తలు తమ కళలతో తెలంగాణ ఘనతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కళాబృందానికి మెమెంటోను అందించి సత్కరించారు. కార్యక్రమంలో కళాకారులు మహేందర్, గణేష్, రాము, గంగాశంకర్, అజయ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మానేరు డ్యాంలో నీటమునిగి గొర్రెలు మృతి

● కుక్కలనుంచి తప్పించుకునేందుకు నీటిలోకి దూకిన మూగజీవాలు

గన్నేరువరం, జులై 11: మానేరు డ్యాంలో నీట మునిగి పలు గొర్రెలు మృతి చెందాయి. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు మర్రి తిరుపతి, పేరం ముత్తయ్య, మడికంటి అశోక్‌కు చెందిన గొర్రెలను మేత కోసం గ్రామశివారులోని మానేరు డ్యాం పరిసర ప్రాంతంలో మేపడానికి గొర్లను తీసుకెళ్లారు. మధ్యాహ్న సమయంలో కాపరులు భోజనం చేస్తుండగా గుంపుగా వచ్చిన కుక్కలు ఒక్కసారిగా గొర్రెల మందపై దాడి చేశాయి. దీంతో కుక్కల భయానికి గొర్రెలు అన్నీ నీటిలోకి దూకగా సుమారు 30 గొర్లు నీటిలో గల్లంతు కాగా 70 గొర్లను అక్కడే ఉన్న మత్స్యకారులు రక్షించారు. నీటిలో మునిగిన గొర్లలో మృతి చెందిన ఆరు గొర్రెల మృతదేహాలు లభ్యం కాగా మిగతా వాటి జాడ తెలియలేదు. తమకు జీవనాధారమైన మూగజీవాలను కోల్పోయామని ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని బాధిత గొర్రెల కాపరులు వేడుకుంటున్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గాయాలు

మల్యాల, జూలై 11: తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశత్తూ జారి పడడంతో గీతకార్మికుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. మండలంలోని మల్యాలకు చెందిన కాసారం ఆంజనేయులుగౌడ్ గురువారం కల్లు కోసం తాటి చెట్టు ఎక్కి కిందకు వస్తుండగా ప్రమాదవశత్తూ జారి కింద పడ్డాడు. దీంతో ఆంజనేయులుకు ఛాతిలో, నడుముకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

పేదలకు అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న బీజేపీ నాయకుడు తొడుపునూరి కరుణాకర్

భగత్‌నగర్, జూలై 11: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ జన్మదినం పురస్కరించుకుని నగరంలో బీజేపీ నాయకుడు తొడుపునూరి కరుణాకర్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో బండిసంజయ్‌తో కలిసి చదువుకున్న కరుణాకర్‌తో పాటు మిత్రులు, పూర్వ విద్యార్థులు అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో బి కిషన్, జిరమేష్, పి వేణు, వి మధు, టిప్రకాశ్, నరేందర్,ఆర్‌కెపి రమేష్, రఘు, నందన్ ముందాడ, తదితరులు పాల్గొన్నారు.

నేతన్నల సమస్యలు గుర్తించినందుకు సంతోషం

-కేటీఆర్ బహిరంగ లేఖకు బండిసంజయ్ కౌంటర్

కరీంనగర్, జూలై 11(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'సామాజిక మాధ్యమాలు, ఇతర మీడియాల ద్వారా మీరు రాసిన లేఖలోని అంశాలను తెలుసుకున్నాను. ఇన్నాళ్లకైనా మీరు సిరిసిల్ల నేతన్నల సమస్యలను గుర్తించినందుకు సంతోషం' అంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు బహిరంగ లేఖకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కౌంటర్ ఇచ్చారు. రాష్ట్రంలో పదేళ్ల అధికారంలో మీరే ఉన్నారన్నారు. 15 సంవత్సరాలుగా సిరిసిల్లలో మీరే ప్రాతినిధ్యం వహించారు. 15 సంవత్సరాలుగా నేతన్నల ఆకలిచావులు కనిపించలేదా అని ప్రశ్నించారు. బతుకమ్మ ఆర్డర్లిచ్చి బకాయిలు చెల్లించకుండా పవర్‌లూం సంస్థలు మూతపడేలా చేసింది మీరు కాదా అన్నారు. కరెంట్ సబ్సిడీలను నిలిపి వేసి సంస్థల ఉసురు తీసింది మీరు కాదా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఆనాడు మీ ప్రభుత్వం సహకరించి ఉంటే సిరిసిల్లలో మెగా పవర్‌లూం పార్క్ ఎప్పుడో ఏర్పాటయ్యేదన్నారు. సిరిసిల్ల నేతన్నలను సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు కేంద్ర మంత్రిగా, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా శాయశక్తులా ప్రయత్నిస్తున్నానని బండి సంజయ్ అన్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

కరీంనగర్ రూరల్, జూలై11: మండలంలో ప్రతి గ్రామ పంచాయతీల్లో నిర్వహించే వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె మహేష్ గ్రామాల కార్యదర్శులకు సూచించారు. గురువారం మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుండి వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఎపీఓ శోభరాణి, ప్రతేకాధికారులు బి.సత్యం, డాక్టర్ రామకృష్ణ, రమనారెడ్డి పాల్గొన్నారు.

మానకొండూరు సీఐపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్, జూలై 11: మానకొండూరు సీఐపై చర్యలు తీసుకోవాలని రైతు బొప్పు శ్రీహరి కోరారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను తన పిల్లలతో కలిసి వ్యవసాయం చేసుకుంటున్నానని తెలిపారు. ఇది ఓర్వలేని ఓ వ్యక్తి ప్రోత్సాహంతో మానకొండూరు సీఐ తను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. 2023లో భూ వివాద విషయంలో సివిల్ సూట్ వేశానని తెలిపారు. అపోజిషన్ వారు తన వ్యవసాయ భూమిలోని చెట్లపై దాడులు చేసి లక్షల్లో నష్టం కల్గించారని ఆరోపించారు. ఈ విషయమై సీఐకి 9 సార్లు కేసులు పెడితే ఎఫ్ఐఆర్ నమోదు చేసి అందులో 4 కేసులు మూసి వేశారని, అడిగితే సివిల్ మ్యాటర్ అంటున్నాడని ఆరోపించారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

సుభాష్‌నగర్, జూలై 11: జనాభాలో 13.8 శాతం ఉన్న ముదిరాజ్‌లను బీసీ-డి నుంచి బీసీ-ఏలో చేర్చాలని ముదిరాజ్ మహాసభ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుర్రాల మల్లేశం కోరారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ కమిషన్ సర్వే ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని కోర్టు చెప్పినందున ప్రభుత్వం అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పిట్టల వెంకటనర్సయ్య, పండుగ బాలు, కొలకాని నర్సయ్య, గీకురు రవీందర్, పండుగ నాగరాజు, రెడ్డి సురేష్, బాషవేని శ్రీను పాల్గొన్నారు.

'ఎస్‌యూలో అక్రమాలపై విచారణ జరపాలి'

గణేశ్‌నగర్, జూలై11: శాతవాహన యూనివర్సిటీలో అక్రమాలపై విచారణ జరపాలని సామాజిక కార్యకర్తలు కోట శ్యాంకుమార్, బెల్లపు కరుణాకర్‌లు గురువారం యూనివర్సిటీ గేటు ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో జరుగుతున్న అనేక అవకతవకలపై కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌పై విచారణ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలను తీసుకోవాలని కోరారు. విశ్వవిద్యాలయాన్ని కాపాడుకోవడానికి రాబోయే రోజుల్లో రిలే నిరాహార దీక్షలకు, ఆమరణ నిరాహార దీక్షలకు పూనుకుంటామని హెచ్చరించారు. గవర్నర్/ఛాన్సలర్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అఫీషియల్ మెయిల్ ఐడీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఇన్‌చార్జి ఏజీపీగా గుర్రం శ్రీనివాస్‌గౌడ్



హుజూరాబాద్ లీగల్, జూలై 11: హుజూరాబాద్ సీనియర్ సివిల్ జడ్జీ కోర్టు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు ఇన్‌చార్జి అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్‌గా గుర్రం శ్రీనివాస్‌గౌడ్‌ను నియమిస్తూ కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శంకరపట్నం మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రెండు పర్యాయాలు ఏజీపీగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు శ్రీనివాస్‌గౌడ్‌ను అభినందించారు.

అభివృద్ధి పనుల కోసం తీర్మానాలు

చొప్పదండి, జూలై 11: పట్టణంలో పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు మున్సిపల్ కార్యవర్గం పలు తీర్మానాలను ఆమోదించారు. గురువారం మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. పట్టణంలోని అన్ని వార్డులలో మంచినీటి పైపు లైన్లు వేసి పాత బోర్లకు మరమ్మత్తులు చేయాలని పారిశుధ్య పనులతోపాటు రక్షిత మంచినీటి సరఫరా చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్ కో-ఆప్షన్ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు. కాగా ప్రజా సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని, దోమల మందులు స్ప్రే చేయడం లేదని 6వ వార్డు కౌన్సిలర్ వడ్లూరి గంగరాజు ఆరోపించారు.

టేకుర్తి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా శ్రీధర్

ఇల్లందకుంట, జూలై 11: మండలంలోని టేకుర్తి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా కండెం శ్రీధర్‌బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ సత్యనారాయణచారి వ్యక్తిగత కారణాల వల్ల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించలేనని ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో సీనియర్ ఉపాధ్యాయుడైన కండెం శ్రీధర్‌బాబును ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబుకు పాఠశాల క మిటీ చైర్‌పర్సన్ మమత, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

శంకరపట్నం, జూలై 11: మండలంలోని కేశవపట్నంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిని అనుకొని నిర్మించిన అక్రమ నిర్మాణాలను గ్రామపంచాయతీ సిబ్బంది గురువారం తొలగించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిని అనుకొని కేశవపట్నం మెయిన్ రోడ్‌లో అక్రమ నిర్మాణాల యజమానులను ఎంపీడీవో శ్రీవాణి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ నుంచి గతంలో నోటీసులు పంపించారు. కేశవపట్నం మెయిన్ రోడ్డుకు ఇరువైపులా జాతీయ రహదారిని అక్రమించి వివిధ రకాల షాపులు నిర్వహిస్తున్నారు. దీంతో తరుచూ జాతీయ రహదారిపైన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రహదారి ఇరువైపులా 50 ఫీట్ల వరకు ఉన్న షాపులు, ఇతర నిర్మాణాలను ఎక్స్‌కావేటర్ సహాయంతో సిబ్బంది తొలగిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భాషా నైపుణ్యాలను పెంపొందించాలి

మానకొండూర్, జూలై 11 : విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలను పెంపొందించాలని డీఈవో జనార్దన్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను ఆయన గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతులను పరిశీలించారు. పిల్లల హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. మండల విద్యాధికారి ఎం. మధుసుదనాచారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఘనంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ జన్మదినం



చామనపెల్లిలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

భగత్‌నగర్, జూలై 11: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండిసంజయ్‌కుమార్ జన్మదిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. మైనార్టీమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్, జిల్లా అధ్యక్షుడు సమీపర్వేస్ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. టవర్ సర్కిల్ వద్ద బీజేపీ నాయకులు, కార్పొరేటర్ వంగల శ్రీదేవిపవన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహించారు. బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణ చౌక్ వద్ద కేక్ కట్‌చేసి టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●నగరంలోని శిశుమందిర్ పాఠశాలలో వంట సామగ్రితో పాటు స్వీట్లు పంపిణీ చేశారు.

●హౌజింగ్‌బోర్డు కాలనీ అనాధ వృద్ధాశ్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొండూరి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో వృద్ధులకు బెడ్‌షీట్లు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల రమేష్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

●అంబేద్కర్ స్టేడియంలో వాకర్స్ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేశారు. హౌజింగ్ బోర్డు వృద్ధాశ్రమంలో అల్పాహారం అందించారు. గణేష్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బుక్స్, బిస్కెట్స్, పెన్సిల్స్ అందజేశారు. 50వ డివిజన్ గణేష్‌నగర్‌లో బీజేపీ నాయకుల కార్పొరేటర్ కొలిపాక అంజయ్య ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు.

●నగరంలోని 59వ డివిజన్ సుష్మాస్వరాజ్ చౌరస్తాలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డెడి శ్రీనివాస్ (బాలు) ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బాస సత్యనారాయణరావు ఉన్నారు.

●రేకుర్తిలోని ప్రభుత్వ బధిరుల పాఠశాలలో బీజేపీ మహిళా నాయకులు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరాల జ్యోతి, సౌత్ జోన్ మహిళా అధ్యక్షురాలు సునీత, ఈస్ట్‌జోన్ అధ్యక్షురాలు సుధా వైష్ణవి ఉన్నారు.

● 17వ డివిజన్ శాతవాహన యూనివర్సిటీ చౌక్ వద్ద పశ్చిమ జోన్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి సంబురాలు నిర్వహించారు.

●జ్యోతినగర్‌లోని లేబర్ అడ్డా వద్ద కార్పొరేటర్ రాపర్తి విజయ, జిల్లా కార్యదర్శి రాపర్తిప్రసాద్ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. బీజేపీఅసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ చేపట్టారు. ఒకటవ డివిజన్ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో తీగలగుట్టపల్లిలోని సహాయ అనాథ శరణాలయంలో పిల్లలకు పండ్లు, పంపిణీ చేశారు. రాంనగర్‌లోని 15వ డివిజన్‌లో పెంట శ్రీనివాస్ ఆధ్వర్యంలో జన్మదినం ఘనంగా నిర్వహించారు.

●కరీంనగర్ రూరల్: బొమ్మకల్ కృష్ణానగర్‌లో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు దేవరకొండ అజయ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 30మంది రక్తదానం చేశారు. ఈకార్యక్రమంలో బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ళపల్లి శ్రీనివాస్‌గౌడ్, ఎలగందుల నందకుమార్, దుబాల శ్రీనివాస్, మండల శాఖ అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్,దాసరి రమణారెడ్డి, చిందం అశోక్‌సదానందం, అసిరి తిరుపతి, వెంకటేష్, రామచంద్రం, శివారెడ్డి, కమలాకర్, హరీష్, సురేష్, నంద కిషోర్ పాల్గొన్నారు.

●బొమ్మకల్‌లో రైతు మిత్ర సహకార సంఘం బ్లడ్ డోనేషన్ క్యాంపు నిర్వహించారు. బీజేవైయం మండల కార్యవర్గ సభ్యులు నేరళ్ల శశి కేక్ కట్ చేశారు.

● చామనపల్లిలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిదిగా జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ కేక్ కట్‌చేసి, మొక్కలు నాటారు.

●హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో స్థానిక బీజేపీ శ్రేణులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గంగిశెట్టి రాజు, కేసరి శేషయ్య, పైళ్ల వెంకటరెడ్డి, తూర్పాటి రాజు పాల్గొన్నారు.

● శంకరపట్నం: మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో దాసారపు నరేందర్, మహ్మద్ ఖాజాపాషా, జంగ జైపాల్, శ్రీనివాస్, ప్రశాంత్, రాజిరెడ్డి, సారయ్య పాల్గొన్నారు.

● ఇల్లందకుంట: మండల కేంద్రంలోని వృద్ధాశ్ర మంలో బీజేపీ నాయకులు వృద్ధులతో కేక్‌కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప్పర రమేష్ ఉన్నారు.

●మానకొండూర్: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్ ఉన్నారు.

●తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్‌లోని ఎల్ఎండీ కాలనీలో గల మానసిక వికలాంగుల పాఠశాలలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి పాల్గొన్నారు.

● చొప్పదండి: మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్, నాయకులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, చేపూరి సత్యనారాయణగౌడ్, రాజన్నల రాజు, చిల్ల శ్రావణ్ పాల్గొన్నారు.

● గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేయగా బూరుగుపల్లిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తం దానం చేసిన యువకులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పండ్లుపంపిణీ చేశారు.

● జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌరస్తాలో బీజేపీ పట్టణ అధ్యక్షులు జీడి మల్లేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ బాలుర పాఠశాల, కొత్తపల్లిలోని స్పందన అనాథ ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు.

● చిగురుమామిడి: మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కేక్ కట్ చేసి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

● రామడుగు: మండల కేంద్రంలో జరిగిన బండి సంజయ్ జన్మదిన వేడుకల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్‌యాదవ్, కరుణాకర్‌రెడ్డి, పొన్నం శ్రీనివాస్, మోడీ రవీందర్ పాల్గొన్నారు.

● వీణవంక: మండల కేంద్రంలోని బస్టాండు కూడలిలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి, నాయకులు చెన్న మాధవుని నర్సింహరాజు, బత్తిని నరేష్ పాల్గొన్నారు.

ప్రవాస భారతీయ విద్యార్థిని ఔదార్యం

-కరీంనగర్ బాల గోకులానికి విరాళం అందజేత



హరిణి

కరీంనగర్ కల్చరల్, జూలై 11: కరీంనగర్‌కు చెందిన ప్రవాస భారతీయుడు లక్కాకుల వినయ్ కుటుంబం అమెరికాలోని మిచిగాన్‌లో నివసిస్తోంది. ఆయన కూతురు హరిణి లక్కాకుల నోవి హైస్కూల్‌లో విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా అక్కడి ప్రవాస భారతీయుల నుంచి ఒక లక్షా అరవైఐదు వేల రూపాయలు సేకరించారు. ఆ విరాళాలను కరీంనగర్‌లోని వెంకట్ ఫౌండే షన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలగోకులానికి గురువారం పంపించారు. సుమారు 40మంది అనాథ విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు అందజేసినట్లు ఆమె పేర్కొన్నారు.

మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలి జన్మదినం

కరీంనగర్ అర్బన్, జూలై 11 : మహిళా కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు, గోపాల్‌రావు పేట్ గ్రామ మాజీ సర్పంచ్ కర్ర సత్య ప్రసన్నరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్‌పార్టీల ఆధ్వర్యంలో గురువారం రిషి కాన్వెంట్ స్కూల్లో స్కూల్ పిల్లల మధ్య కేక్ కటింగ్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అసెంబ్లీ అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకం



నవాబ్ అలీ జంగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్

కరీంనగర్‌టౌన్, జూలై 11 : సమాజ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమని మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో గురువారం ఇంజనీర్ నవాబ్ అలీ జంగ్ జయంతి(తెలంగాణ ఇంజనీర్స్ డే) వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరపాలక సంస్థ ఇంచార్జి కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మేయర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నవాబ్ అలీ జంగ్ చిత్ర పటానికి మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, పలువురు కార్పోరేటర్లు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఇంజనీర్ గానవాబ్ అలీ జంగ్ చేసిన కార్యక్రమాలను గుర్తు చేసుకోన్నారు. ఈ సందర్భంగా మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ ఆనాడు ఎలాంటి సౌకర్యాలు లేని కాలంలో నవాబ్ అలీ జంగ్ ఇంజనీర్‌గా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ఆయన చేసిన నిర్మాణాలు చాలా గొప్పవి అన్నారు. ఎలాంటి అధునిక టెక్నాలజీ లేకున్నా పెద్ద పెద్ద ప్రాజెక్టులు, కట్టడాలు నిర్మాణం చేసి హైదరాబాద్ నగర ఖ్యాతిని ప్రపంచానికి చాటిన వ్యక్తి అని గుర్తు చేశారు. ఈనాడు ఇంజనీర్ల నైపుణ్యత, ప్రతిభ లేకుండా ఏ కార్యక్రమం జరగడం లేదని తెలిపారు. ఇలాంటి గొప్ప వృత్తిలో ఉన్న ఇంజనీర్ల అందరికి తెలంగాణ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ల నాంపల్లి శ్రీనివాస్, ఎదుల్ల రాజశేఖర్, ఇంజనీరింగ్ అధికారులు ఎస్ఈ మహేందర్, డీఈ వెంకటేశ్వర్లు, లచ్చిరెడ్డి, పిఎంసీ సందీప్, ఏఈ గట్టు స్వామీ, గంగాధర్, గఫూర్ అలీ, ఆర్వో అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పాలనపై పట్టు సాధించని కాంగ్రెస్ ప్రభుత్వం

- ప్రజా సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం కండి - సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి



మాట్లాడుతున్న మర్రి వెంకటస్వామి

చిగురుమామిడి, జూలై 11: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై పట్టు సాధిచడంలో విఫలమైం దని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. మండల కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె చిన్నస్వామి అధ్యక్షతన సీపీఐ మం డల కౌన్సిల్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అనేక తప్పులు జరుగుతున్నాయని, ప్రజాసమస్యలపై సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా అన్నిమండలాల్లో సీపీఐని బలోపేతం చేయాలని అందుకు కార్యకర్తలు గ్రామాల్లో ప్రజా సంఘాలను బలోపేతం చేయాలన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరిపాలన చేసిన విధంగానే నేటి కాంగ్రెస్ ప్రభుత్వపాలన ఉందన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా చేయడం ప్రజాస్వామ్యానికే ప్రమాదమన్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం సరైంది కాదన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభావం తగ్గి పోతోంద న్నారు. రానున్న రోజుల్లో బీజేపీని ప్రజలు గద్దెదించుతారన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి. బోయిని అశోక్, కౌన్సిల్ సభ్యులు బూడిద సదాశివ, ముద్రకోల రాజయ్య, రాకం అంజవ్వ, తెరాల సత్యనారాయణ, ఉస్మాన్ పాషా, జనార్దన్, గందె కోమురయ్య, కాత మల్లయ్య, అందె సంపత్, బసంతం, అంజయ్య, రవి, తిరుపతి, వెంకట్, వీరయ్య, అన్ని గ్రామాల శాఖ కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

హుజూరాబాద్, జూలై 11: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. గురువారం హుజూరాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని పార్క్‌లో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ మొక్కలు నాటాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఏఈ సాంబరాజు, వినయ్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: సమాజ సంక్షేమం కోసం ఆలోచించే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆలయ ఫౌండేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ తీట్ల రమేష్ కోరారు. ఆలయ ఫౌండేషన్ సభ్యులు గరువారం మహత్మానగర్, కొత్తపల్లి గ్రామాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. మహాత్మనగర్‌లోని మానసిక వికలాంగుల పాఠశాలను సదర్శించిన సభ్యులు పాఠశాలకు అవసరమైయ్యే వాటిపై తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కొత్తపల్లిలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మిట్టపల్లి రాజేందర్, సుగుర్తి జగదీశ్వరాచారి, అరవింద్ యాదవ్, గడ్డం అరుణ్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

డీఎస్సీ వాయిదా ఆందోళన వెనుక కుట్ర

చిగురుమామిడి, జూలై 11: డీఎస్సీ వాయిదా వేయాలని చేస్తున్న ఆందోళన వెనుక కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు, బీఆర్‌ఎస్ పార్టీ కుట్ర ఉందని జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి అనేక కుట్రలు చేస్తోందన్నారు. నిరుద్యోగ యువత గురించి మాట్లడే నైతిక హక్కు బీఆర్‌ఎస్ నాయకులకు లేదన్నారు. డీఎస్సీ వాయిదా వేయడం వల్ల కోచింగ్ సెంటర్లకు లక్షల రూపాయలను దోచి పెట్టడమేనని ఆన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కపట ప్రేమను తెలంగాణ సమాజం నిషితంగా గమనిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

జమ్మికుంట రూరల్, జూలై 11: జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని ఉపఆరోగ్య ఉప కేంద్రాల వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంరద్బంగా గ్రామంలోని ప్రధాన కూడళ్లలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కుటుంబ నియంత్రణలో బాధ్యత వహిద్దాం, తల్లి పిల్లల సంపూర్ణ ఆరోగ్యాన్ని పరిరక్షిద్దాం అంటూ నినాదాలు చేశారు. వైద్యాధికారులు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా చాలా ఆందోళన కలిగించే విషయమన్నారు. ప్రపంచ జనాభాకు సంబంధించిన కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, పేదరికం, మాతృ ఆరోగ్యం, మానవ హక్కులు వంటివి జనాబా సమస్యలపై ప్రజలకు అవగాహన పెంచడమే ప్రపంచ జనాభా ధినోత్సవం లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఫరహానుద్దీన్, విజయ్‌కుమార్, మహోన్నత, సంధ్యారాణి, కార్తీక్, హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

'జ్యోతిష్మతి'లో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



పాల్గొన్న విద్యార్థులు

తిమ్మాపూర్, జూలై 11: స్థానిక జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (అటానమస్) కళాశాలలో గురువారం బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అనే అంశంపై ఆన్‌లైన్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఛండీగఢ్‌లోని మొహాలీలో కోడ్ తంత్ర టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ ప్రొడక్ట్ ఇంజనీర్ డాక్టర్ జగన్‌దీప్ సింగ్ సింధు ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో అవగాహ న కార్యక్రమం నిర్వహించినట్లు జ్యోతిష్మతి విద్యా సంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. ఇందులో గ్లోబల్, దేశీయ మార్కెట్‌ల కోసం విద్యార్థులను ఉద్యోగాలను సిద్ధం చేయడానికి, అత్యధిక డిమాండ్ ఉన్న సాంకేతిక నైపుణ్యాల కోసం వారిని సిద్ధం చేయడానికి విద్యార్థులను మెరుగుపరచడం ఈ కార్యక్రమం లక్ష్యం అని అన్నారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో సీనియర్ ప్రొడక్ట్ ఇంజనీర్ డాక్టర్ జగన్‌దీప్ సింగ్ సింధు విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్, క్రిటికల్ థింకింగ్, కాంప్లెక్స్ ప్రాబ్లమ్స్ సాల్వింగ్, ప్రైవేటు, పబ్లిక్ సెక్టార్ వంటి విభిన్న డొమైన్‌లలోని అవకాశాలపై వివరించినట్లు తెలిపారు. విద్యార్థులు ఉద్యోగం ఛేదించడంలో అడ్డంకులు గూర్చి ప్రశ్నోత్తరాల రౌండ్ నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి సెషన్‌లు విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని, భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ జువ్వాడి సాగర్ రావు, సెక్రటరీ జువ్వాడి సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ కె.ఎస్ రావు, హెచ్ఓడీ ఆర్ జగదీశన్, అధ్యాపకులు గుండ ప్రణవి, జి రాకేష్, కే వనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

కరీంనగర్ లీగల్, జూలై11: రెండు రోజుల క్రితం సిద్దిపేట జిల్లా కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న రవి కుమార్ అనే న్యాయవాదిపై సిద్దిపేట టూ టౌన్ పోలీసులు చేసిన దాడికి నిరసనగా గురువారం కరీంనగర్ జిల్లా కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించి జిల్లా కోర్టు ఎదురుగా నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు తిరుకోవెల రఘువీర్, సీనియర్ కార్యవర్గ సభ్యులు సుంకే దేవకిషన్, జూనియర్ కార్యవర్గ సభ్యులు బెజ్జంకి శ్రీకాంత్, పస్తం ఆంజనేయులు, సీనియర్ న్యాయవాదుల డి.మల్లయ్య, రూపిరెడ్డి దేవేందర్‌రెడ్డి, లక్ష్మణ్ రావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జూలై 11: జిల్లాలో గల తెలంగాణ క్రైస్తవ మైనారిటీ విద్యార్థులు ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ స్ప్రింగ్ సీజన్ 2024 సంవత్సరమునకు గాను ఆగస్టు 7వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ స్టేట్ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాను ప్రకటనలో తెలియజేశారు.

అర్బన్ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ

కరీంనగర్ అర్బన్, జూలై 11 : ది కరీంనగర్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసింది. మూడు రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. అర్బన్‌బ్యాంక్ పాలకవర్గం పదవీ కాలం 2 నెలల కిందటే ముగియటంతో కొత్తగా పర్సన్ ఇన్‌చార్జి కమిటీని నియామకం చేశారు. కరీంనగర్ అదనపు కలెక్టర్ అర్బన్ బ్యాంక్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. పర్సన్ ఇంచార్జి కమిటీ సభ్యులుగా డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ ఆఫీసర్‌తో పాటు గడ్డం విలాస్‌రెడ్డి, మడుపు మోహన్, ముక్క భాస్కర్, బీరం ఆంజనేయులు, మహ్మద్ కలీంఖాన్, రేగొండ సందీప్, మూల లక్ష్మి, ఏ విద్యాసాగర్, ఇ లక్ష్మణ్‌రాజు, ఎండీ సిమియొద్దీన్, మంగి రవీందర్‌లను నియామకం చేశారు.

సాయిబాబా ఆలయ హుండీల లెక్కింపు

కరీంనగర్ కల్చరల్, జూలై 11: నగరంలోని సాయినగర్ విజయగణపతి సాయిబాబా దేవాలయ హుండీలను గురువారం లెక్కించగా దాదాపు 4 నెలలకు గాను 3,55,449 రూపాయల ఆదాయం సమకూరింది. లెక్కింపులో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పాము సత్యనారాయణ, ఈఓ ఎండపెల్లి మారుతి, చైర్మన్ అయిందాల లక్ష్మయ్య, వ్యవస్థాపక ధర్మకర్త చిట్టుమల్ల కొండయ్య, సిబ్బంది పిట్టల అంజయ్య, గుడికాడి శ్రీనివాస్, అర్చకులు, గోవిందపతి శ్రీవారి సేవాసమితి కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

●సుభాష్‌నగర్: పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందేవరు.. మీరు కాదా అని ప్రజామిత్ర ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ కేసీఆర్, కేటీఆర్‌లను ప్రశ్నించారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

●ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంకమ్మతోట లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బూర్ల విద్యాసాగర్ ఆధ్వర్యంలో రాంనగర్‌లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు.

●నగరంలోని మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గురువారం స్థానిక రిలయన్స్ ట్రెండ్స్ మాల్ ఉద్యోగులకు నిర్వహించిన ఈ ఉచిత వైద్యశిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, టుడీ ఇకో, వంటి సూపర్ స్పెషాలిటీ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ గుర్రం కిరణ్, రిలయన్స్ ట్రెండ్స్ మేనేజర్ రోహిదాస్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

●కరీంనగర్ కల్చరల్: కరీంనగర్ పుర వీధుల్లో ఈ నెల 15న కరీంనగర్ ఇస్కాన్ దేవాలయం, జగన్నాథ రథయాత్ర కమిటి, ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో నిర్వహించే జగన్నాథ రథయాత్ర సందర్భంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు కరీంనగర్ మున్సిపాలిటి కార్యాలయ ద్వారం వద్ద బలభద్ర సుభద్రా సమేత జగన్నాథ స్వామి సైకత శిల్పావిష్కరణ ఉంటుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించి సైకత శిల్పాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

●భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో గీతాభవన్ ప్రక్కన గల వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో శనివారం ఉదయం 10 గంటలకు రచయిత వైరాగ్యం ప్రభాకర్ రచించిన రామాయణము ధర్మవచనములు-సూక్తులు పుస్తకావి ష్కరణ సభ నిర్వహిస్తున్నట్లు గాయకుడు, ఉపాధ్యాయుడు కాను మహేందర్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

●కరీంనగర్ స్పోర్ట్స్: వోకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇటీవల నిర్వహించిన బ్లాక్ బెల్ట్ పోటీ పరీక్షలలో కొత్తపల్లి మండలం చింతకుంటకు చెందిన ముగ్గురు క్రీడాకారులు బ్లాక్ బెల్ట్ సాధించారు. పి రోహన్, బి హరితేజ, బి హిమతేజలు పోటీ పరీక్షలలో విశేష ప్రతిభ చాటి బ్లాక్ బెల్ట్ గ్రేడ్ వన్ సాధించి పలువురు ప్రశంసలను అందుకున్నారు. వీరిని గురువారం రూరల్ ఏసీపీ వెంకటరమణ ప్రశంసా పత్రాలు, మెమొంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో కరాటే కోచ్ పి తిరుపతి, ఓకినావా మార్షల్ ఆర్ట్స్ సంస్థల చీఫ్ ఎగ్జామినర్ కే. వసంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● రామడుగు: కోర్టు డ్యూటీలో ఉన్న న్యాయవాదిపై దాడికి పాల్పడిన సిద్దిపేట టూటౌన్ ఏఎస్ఐ ఉమారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కరీంనగర్ బార్ సీనియర్ అడ్వకేట్ మ్యాన మురళీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

● జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులో విద్యుత్ సర్వీస్ వైర్లు లూజు ఉండి ప్రమాదకరంగా ఉన్న సమస్యను కౌన్సిలర్ దేశిని రాధా-సదానందం ఇటీవల జరిగిన టీజీఎన్‌పీడీసీఎల్ వినియోగదారుల పరిష్కార వేదికలో ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ట్రాన్స్‌కో అధాకారులు విద్యుత్ స్తంబాలు వేసి, లూజుగా ఉన్న వైర్లను సరి చేశారు.

● హుజూరాబాద్‌రూరల్: పట్టణ శివారులోని కేసీ క్యాంపులోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు కూల్చివేతపై గురువారం జిల్లా కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారికి బీజేపీ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ బింగి కరుణాకర్ వినతి పత్రం సమర్పించారు. అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే నిర్మాణాన్ని కూల్చివేశారని, దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

- హుజూరాబాద్ మండలంలోని చెల్పూర్‌కు చెందిన పబ్బు రవీందర్ చిన్న కుమారుడు శరత్ చంద్ర గురువారం విడుదలైన సీఏ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు.

● తిమ్మాపూర్: రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా హైదారాబాద్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించిన మానాల మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

● గంగాధర: బూరుగుపల్లిలో గురువారం జల్లా పరిషత్, మండల పరిషత్, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు 400 ప్లేట్లను స్వచ్ఛంద సేవకుడు తూడి లచ్చయ్య అందజేశారు. ఎంఈవో అంబటి వేణుకుమార్ ఉన్నారు.

● వీణవంక: మండలంలోని ఘన్ముక్ల మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి విద్యార్థులకు స్వాగత కార్యక్రమం జరగగా విద్యార్థులు నృత్యాలు, నాటికలు సాంస్కృతిక అంశాలు ప్రదర్శించారు.

- వీణవంక మండలంలోని నర్సింగాపూర్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు హరిహరక్షేత్ర సమితి అధ్వర్యంలో వాత్సల్య పిల్లల అసుపత్రి సహకారంతో ఉచిత వైద్యా శిబిరన్ని చేపట్టారు.

● హుజూరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సత్యప్రసన్నరెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. లావణ్య, సుశీల, రజిత, పుష్పలత, రాధ, మల్లేశ్వరి, రేణుక పాల్గొన్నారు.